క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉరుకుంద విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్న తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీలో తమ విద్యార్థులు ఏడుగురు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: టపాసుల దుకాణ యజమానులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వీవర్స్ కాలనీ వైడబ్ల్యూఎస్ మైదానంలో టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దుకాణదారులు అనుమతులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టపాసులను అధిక ధరలకు విక్రయించరాదని.. ఎంఆర్‌పీకే అమ్మలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు వీరేంద్రగౌడ్, జ్యోతిర్మయి, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, ఫైర్ ఎస్‌ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనలో ఐకరాజ్య సమితి కీలక పాత్ర



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్

ఆదోని సెంట్రల్: ప్రపంచ శాంతి నెలకోల్పడంలో ఐక్యరాజ్య సమితి కీలక పాత్ర పోషిస్తోందని అర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి అయ్యప్ప తెలిపారు. గురువారం ఆదోని అర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన ఐకరాజ్య సమితి దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఐక్యరాజ్యసమితి ఏర్పాటు, వాటి విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, వెంకటరామిరెడ్డి, గోవిందు, యల్లప్ప, జోనాథన్ తదితరులు పాల్గొన్నారు.

కులుమాలలో డెంగీ కేసు నమోదు



బాలుడి ఇంటి పరిసరాలను శుభ్రం చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : మండల పరిధిలోని కులుమాల గ్రామంలో 12 ఏళ్ల బాలుడికి డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. గురువారం వైద్య సిబ్బంది కులుమాల గ్రామానికి వెళ్లి నివారణ చర్యలు చేపట్టారు. డెంగీ కేసు నమోదైన బాలుడి ఇంటి పరిసరా ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగు నీరు, నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామదాస్, ఎంపీహెచ్ఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి శిథిలం

- జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి వెళ్లే రోడ్డు అధ్వానం
- కోడుమూరు – ఎమ్మిగనూరు మధ్యలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- అధికారంలోకి వస్తే రోడ్డు నిర్మిస్తామని కూటమి నేతల హామీ
- ఐదునెలలు కావస్తున్నా కనీసం మరమ్మతులకు నోచుకోని వైనం



పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ వద్ద చెరువును తలపిస్తున్న కర్నూలు ప్రధాన రహదారి (ఫైల్)

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. జిల్లా కేంద్రం నుంచి ఎమ్మిగనూరు వరకు ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైంది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఏమాత్రం ఆదమరిస్తే ప్రమాదాలకు గురికాకతప్పని పరిస్థితి. రహదారి నిర్మిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఐదునెలలు కావస్తున్నా ఇంతవరకూ కనీసం మరమ్మతులు కూడా చేయించలేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి మధ్యలో పెద్దపెద్ద గోతులు

జిల్లా కేంద్రం కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, మంత్రాలయ, ఆదోని, కర్ణాటక రాష్ట్రం బళ్లారి, రాయచూరుకు వెళ్లే ప్రధాన రహదారి శిథిలమైంది. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు పట్టణాల మధ్య రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు అందులో నిలిచిపోతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల వేముగోడు వద్ద ఓ వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై అందులో ఉన్న వారు గాయపడ్డారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి వాహనాల్లో వెళ్లే భక్తులు ఈ రహదారి పరిస్థితి తెలియక వేగంగా వచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఎన్నికల ముందు ప్రధాన రహదారిని పునర్నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా కనీసం శిథిలమైన రోడ్డు గతుకులకు అతుకులైనా వేయాలని వాహనదారులు మండిపడుతున్నారు.



ఎర్రకోట వద్ద శిథిలమైన రహదారి

చెరువును తలపిస్తున్న గోనెగండ్ల బైపాస్ రోడ్డు

పట్టణం నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలోని గోనెగండ్ల బైపాస్ వద్ద రోడ్డు శిథిలమై పెద్ద గోతులు పడ్డాయి. చిన్నపాటి వర్షం వస్తే ఆ ప్రాంతంలో నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. అందులో నుంచి వాహనాల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గోతుల్లో ద్విచక్రవాహదారులు ఏమాత్రం ఆదమరిచినా కిందపడి కాలో, చేయ్యే విరగకతప్పదన్నట్లుగా మారిపోయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్త రోడ్డు నిర్మించాలి



ఎమ్మిగనూరు పట్టణం నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారి శిథిలమైంది. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా ఆర్అండ్‌బీ అధికారులు పునర్నిర్మించాలి. రోడ్డు శిథిలం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై గోతులతో పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్ర జాప్రతినిధులు, అధికారులు ఇదిగో చేస్తాం, అదిగో చేస్తామన్న ప్రకటనలు చేయడం కాకుండా యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– పంపణ్ణగౌడ్, సీపీఐ జిల్లా నాయకుడు, ఎమ్మిగనూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని మదిరె గ్రామ సమీపంలో గురువారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో బసాపురం గ్రామానికి చెందిన ఉరుకుందకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పలో పెళ్లి చూసుకుని వస్తున్నానని, మదిరె గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైకు ఢీకొని వెళ్లిపోయిందని బాధితుడు చెప్పాడు.

ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీ జి. యజ్ఞ నారాయణ

కోసిగి: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి శ్రీ జి.యజ్ఞ నారాయణ అన్నారు. గురువారం సాయంత్రం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. అంతకు ముందుగా హాస్టల్ పరిసరాలు, భోజన వసతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చదువుతోనే అనుకున్న లక్ష్యం సాధించవచ్చునన్నారు. చెడు అలవాట్లు, చెడు మార్గాల వైపు చూస్తే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది, ఉన్నారు.

గురజాల హుండీ ఆదాయం రూ.1.06 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

నందవరం : ప్రముఖ గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ప్రధాన హుండీ కానుకలు ఆదోని డివిజన్ దేవాలయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కబెట్టారు. అందులో కరెన్సీ రూపంలో రూ.99,240, నాణేల రూపంలో రూ.7,729 నగదు వచ్చింది. మొత్తం హుండీ ఆదాయం రూ. 1,06,289 సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జీ ఈవో రామ్‌ప్రసాద్ వివరించారు. హుండీ లెక్కింపులో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, గ్రామ సర్పంచు వీరస్వామి, పూజారి హంపేష్‌స్వామి, గ్రామ పెద్దలు రాజేశ్వరరెడ్డి, హనుమంతు, లక్ష్మీకాంతరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ ప్రదానం



స్రవంతికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ సూర్య మోహన్

ఆదోని సెంట్రల్/అర్బన్: గత నెలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా, దానివల్ల కలిగే నష్టాలపై పోలీసు శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన పట్టణంలోని సెయింట్ అంథోని ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతికి 2వ పట్టణ సీఐ సూర్య మోహన్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. గురువారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో స్రవంతి ప్రతిభ చాటడంతో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సిర్టిఫికెట్ పంపినట్లు తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ నుంచి ఎలా రక్షణ పొందాలి, ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి. కేశవయ్య, కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్, వార్డు మహిళా పోలీసు హైమావతి, ఉపాధ్యాయులు నిర్మల మేరీ, ప్రకాశమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నదికైరవాడిలో వైద్య సేవలు

నందవరం : పల్లెల్లో 104 ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని హాలహర్వి పీహెచ్‌సీ డాక్టర్ పరిమళ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలో గ్రామస్తులకు, గర్భిణులు, బాలింతలకు వైద్యాధికారులు వైద్య సేవలు అందించారు. గ్రామంలో 62 మందికి వైద్య సేవలు అందించారు. గర్భిణులు, బాలింతలకు టీకాలు వేశామన్నారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తుంగభద్ర నదికి వరద నీరు రావడంతో నీరు కలుషితమందని, నీటిని వేడి చేసి చల్లర్చి తాగాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జయదీప్, ఏఎన్‌ఎం రాములమ్మపాల్గొన్నారు.

పోలియో నిర్మూలనలో రోటరీ క్లబ్ కృషి ఎనలేనిది



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి

ఆదోని అర్బన్:ప్రపంచంలోని దేశాల్లో పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ ఎనలేనిదని కృషి చేసిందని ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి కొనియాడా రు. గురువారం ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అక్షరశ్రీ, శ్రీ మల్లికార్జున విద్యాల య విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ లో మొట్టమొదటిసా రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 1979లో పోలియో చుక్క లు వేయడం జరిగిందన్నారు. గత 35 ఏళ్లుగా ప్రపంచంలో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ తప్పా మిగతా అన్ని దేశాల్లో పోలియో రహిత దేశాలుగా తీర్చిదిద్దడంలో రోటరీ క్లబ్ కీలక పాత్ర పోషించిందన్నారు. 0–5 ఏళ్ల పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, జీవన్ సింగ్, సునీల్‌రెడ్డి, ప్రశాంత్‌గాంధీ, సోమశేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, రాయచోటి సుబ్బయ్య పాల్గొన్నారు.

పోలియోను తరిమికొడదాం

ఎమ్మిగనూరుటౌన్: పోలియో మహమ్మారిని తరిమి కొట్టేందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తోందని రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు నటరాజ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో ఆయనతో పాటు డాక్టర్లు శ్రీనివాసులు, అనూష విద్యార్థులకు పల్స్‌పోలియో చుక్కలు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి సుధాకర్‌రావు, సభ్యులు బీరప్ప, షఫీవుల్లా, శివకుమార్, రాష్ట్ర శాప్ నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, రైటైర్డ్ ఆర్టీఓ కేఆర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

ఆదోనిరూరల్: రీ–సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రీ సర్వే డీటీ పెద్దయ్య అన్నారు. గురువారం మండలంలోని సాంబగల్ గ్రామంలో రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఈశ్వర్, వీఆర్వో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పెద్దకడుబూరు తహసీల్దార్ శ్రీనాథ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు సూచించారు. గురువారం స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా అధ్యక్షతన ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కు నమోదు దరఖాస్తులను అందజేశారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

కోసిగి: మండలం సాతనూరు గ్రామ పొలాల్లో పులికనుమ పైప్‌లైన్ పగిలి భారీ నీటి లీకేజీతో పంటపొలాలు మునిగిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. గురువారం సాతనూరు గ్రామ సమీపంలోని పొలాల్లో పగిలిన పులికనుమ పైప్‌లైన్, పంట పొలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పైపులైన్ లీకేజీ కారణంగా పత్తి, మిరప పంటలు దాదాపు 50 ఎకరాలకు పైగా నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. అలాగే యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పనులు చేయించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు, జిల్లా నాయకుడు బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు బాబు, హనుమంతు, దాదాపీర్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఐఎస్ఆర్వో సర్టిఫికెట్లు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఐఎస్ఆర్వో, ఐఐఆర్ఎస్ నిర్వహించిన ఆన్‌లైన్ ఇంటర్నషిప్‌లో 120 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందారు. గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ డా. వీ.వీరన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పద్ధతి, అంకాత్మక చిత్ర విశ్లేషణ అనే అంశంపై బీటెక్ మూడవ విద్యార్థులు శిక్షణ తీసుకున్నారని చెప్పారు. శిక్షణ పొందిన 120 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కేసీ అను

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ బాలికల హైస్కూల్‌లో 7వ తరగతి చదువు తున్న కేసీ అను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలికల విభాగం ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు హిందూపురంలోని ఎంజీఎం స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుజన కుమారి గురువారం తెలిపారు.

సమయపాలన పాటించాలి



కన్నూరు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

గోనెగండ్ల : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. గురువారం మండలంలోని కున్నూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది సమయానికి విధులకు హాజరు అవుతున్నారా? రోజు ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి. ఎన్ని పరిష్కరిస్తున్నారని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అవసరమైతే ఫీల్డ్‌కు వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా విధులు నిర్వర్తించాలన్నారు. విధుల పట్ల ఎవరు కూడా నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉల్లి పంటను గ్రేడింగ్ చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధర, ఎకరాకు ఎంత ఖర్చు వస్తుంది, ఎన్ని క్వింటాళ్ల దిగుబడి వస్తుంది, ఎక్కడ సరుకును అమ్ముకుంటారని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ మణి మంజరి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ తదితరులు ఉన్నారు.

వసతి గృహం తనిఖీ



బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న పత్తికొండ జడ్జి ఎంఎస్ భారతి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం రాత్రి పత్తికొండ కోర్టు జడ్జి ఎంఎస్ భారతి తనిఖీ చేశారు. విద్యార్థునులు ఉంటున్న గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్‌లోని సౌకర్యాలను గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే హాస్టల్ వార్డెన్ పని తీరు, మెనూపై ఆరా తీశారు. పడుకోవడానికి మంచాలు, ఫ్యాన్ల కొరత ఉందని విద్యార్థులు జడ్జికి చెప్పారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, హాస్టల్ వార్డెన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎం. ఉపేంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి విద్యార్థులకు గురువులను గౌరవించాలన్నారు. బాలికలు, మహిళలు రక్షణ చట్టాలను అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సమస్యాత్మక గ్రామాలైన నదిచాగి, రౌడూరు పికెటింగ్‌లను పరిశీలించారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రిజ్వాన్, హెచ్‌ఎం ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్‌కు పరామర్శ



టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ రంగన్నను పరామర్శిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ వడ్డె రంగన్నను గురువారం ఆయన ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పోలయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, కోటేకల్ సర్పంచ్ లక్ష్మన్న, దారాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిటౌన్: ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ విలేకరులకు తెలిపారు. బోయగేరికి చెందిన బోయ శ్రీకాంత్, కొడలపేటకు చెందిన బోయ సావిత్రి కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా ఆదోనికి తరలిస్తుండగా రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నామన్నారు. వారివద్ద నుంచి ఏడు బాక్సుల్లో కర్ణాటక మద్యం బాటిళ్లు, 58.5 లీటర్ల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సమయానికి బస్సు నడపాలి

ఆదోని రూరల్: పెద్దకడబూరు మండలానికి సమయానికి బస్సు సర్వీసును నడపాలని విద్యార్థులు డీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో ధర్నా నిర్వహించారు. వన్ టౌన్ సీఐ శ్రీరామ్ అక్కడికి చేరుకుని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయలకుతో మాట్లాడటంతో ధర్నా విరమించారు. డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘు, విద్యార్థులు అశ్విని, సుమిత్ర, అమృత, లావణ్య, శశి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పెద్దకొత్తిలిలో గ్రామసభ

నందవరం : భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తునట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్ద కొత్తిలి గ్రామంలో రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లప్ప, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మగురుడు, వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శివ, మునిరంగడు, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించి క్షేమంగా గమ్యం చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నల్లప్ప

ఆదోని రూరల్: వాహనాలు నడిపేవారు తగిన జాగ్రత్తలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆదోని రూరల్ సీఐ నల్లప్ప సూచించారు. గురువారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులు, 20 మంది ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, రహదారి భద్రత మరియు సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను డ్రైవర్లు ఎక్కించరాదన్నారు. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టును ధరించాలని, మోటార్ సైకిళ్లపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటూ వాహనాలు నడపాలన్నారు. అలాగే అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు వివరాలు అడిగితే షేర్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేష్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజు

కోసిగి: సమాచారం హక్కు చట్టం–2005 పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి రాజు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వ యంత్రాంగం నుంచి అడిగి తెలుసుకునేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా ప్రభుత్వ యంత్రాంగం సమాచారం అందివ్వాలని సూచించారు.

కక్ష సాధింపు మానుకోవాలి

ఆదోనిటౌన్: పట్టణంలోని వంశీ చైతన్య ఆస్పత్రిపై కక్ష సాధింపు మానుకోవాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదోనిలో పేరుపొందిన రమేష్‌యాదవ్‌కి సంబంధించిన వంశీ చైతన్య ఆస్పత్రికి కూటమి నాయకులు, కొంత మంది వెళ్లి సందర్శన పేరుతో వెళ్లి మహిళా రోగులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆదోనిలో ఎన్నో ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నా కేవలం బీసీలకు చెందిన ఆస్పత్రి మాత్రమే కనిపించిందా అని ప్రశ్నించారు. నాయకుల వద్ద ఏదైనా ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు.